



ప్యాపిలిలో మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

టీడీపీ విజయం ఖాయం

కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ప్యాపిలి, ఫిబ్రవరి 11: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్యాపిలి మండలంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు రావడం లేదని, యువతకు ఉద్యోగాలు లేవని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు భూదందాలు, దోపిడీలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైసీపీ నియంత పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి చంద్రబాబు సేవలు అవసరమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడ నుంచి పోటీ చేస్తారన్న ప్రశ్నకు.. అధిష్టానం ఆదేశాల ప్రకారమే పోటీ చేస్తానని కోట్ల వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావుయాదవ్, నాయకులు వలసల రామకృష్ణ, టి.శ్రీనివాసలు, పరమేష్, వై.లక్ష్మీనారాయణ, చల్లా వీరాంజనేయులు, రామ్మోహన్, వెంకటరమణాచారి తదిరులు పాల్గొన్నారు.



లోగుట్టు వెల్లడయ్యేనా...!

నంద్యాల మున్సిపాలిటీలో ఏడాదిన్నర కాలంగా నడిచిన అక్రమాల వ్యవహారం వెనుక చక్రం తిప్పింది ఎవరన్నది ప్రస్తుతం టాక్‌ఆఫ్‌ది టౌన్‌గా మారింది. జనవరి నెలాఖరున జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికార వైసీపీకి చెందిన కౌన్సిలర్ దేశం సులోచన మున్సిపాలిటీలో జరిగిన లోగుట్టు వ్యవహారంపై లేవనెత్తి ప్రశ్నాస్త్రాలు సంధించారు. అధికార పార్టీకి చెందిన కౌన్సిల్‌లోని కొందరు సభ్యులు, అధికార యంత్రాంగంలోని మరికొందరితో కలసికట్టుగా తీసుకున్న నిర్ణయాలపై ఆమె ప్రశ్నించారు. గుట్టుచప్పుడు కాకుండా మున్సిపాలిటీలో పలు ఆర్థికపరమైన, నిర్ణయాత్మక అంశాలు కౌన్సిల్ దృష్టికి రాకుండానే చకచకా జరిగిపోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే కౌన్సిల్‌లో వివిధ పనులు, కేటాయింపులు, నిధుల డ్రాకు సంబంధించి ఆమోదంలేకుండానే రూ.లక్షల్లో నిధుల చెల్లింపులు జరిగినట్లు అధికార పార్టీకే చెందిన కౌన్సిలర్ నిలదీయడం కలకలం రేపింది. పది రోజుల్లోగా టెండర్లు లేకుండా నిధుల డ్రా వెనుక ఏమి జరిగిందన్న విషయంపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేసిన మూడు రోజుల వ్యవధిలోనే ఏడాదిన్నర కాలంగా కమిషనర్‌గా విధులు నిర్వహించిన రవిచంద్రారెడ్డిని ప్రభుత్వం మాతృశాఖకు బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో లోగుట్టు అక్రమాల వ్యవహారంలో అసలు విషయాలపై శ్వేతపత్రం విడుదల ఇక అటకెక్కినట్లేనా..? అని మున్సిపల్ కార్యాలయంలో చర్చగా మారింది.

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 11:

- టెండర్లు లేకుండానే మున్సిపల్ నిధుల డ్రా
- శ్వేతపత్రం విడుదల అటకెక్కినట్లేనా?
- నంద్యాల అధికార పార్టీలో ష్.. గప్ చుప్..

టెండర్లు లేకుండా రూ.లక్షలు విడుదల?

మున్సిపల్ నిధుల నుంచి టెండర్లు లేకుండా రూ.లక్షలకు లక్షలు డ్రా వ్యవహారం వెనుక చక్రం తిప్పిన వారిలో అధికార యంత్రాంగంలోని కీలక వ్యక్తులు, కౌన్సిల్‌లోని కొందరు ముఖ్యులు కుమ్మక్కు అయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ మాబున్నీసాను అధికార పక్ష వైసీపీకి చెందిన 18వ వార్డు కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన ప్రశ్నించడం అధికార పక్షంలో కలకలం రేపింది. రూ.లక్ష, రెండు లక్షల్లో బిల్లులు డ్రా చేస్తే ఎవరూ ఏమీ అనుకోరని, ఏకంగా రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల బిల్లులు టెండర్లు లేకుండా ఏలా డ్రా చేస్తారని నిలదీయడం కలకలం రేపింది. పారిశుధ్య నిర్వహణలో ట్రాక్టర్లను బాడుగకు తీసుకొనే ప్రక్రియలో టెండరు విధానంలో వెళ్తే తక్కువ మొత్తానికి వచ్చేవారు ఉంటారు. అయితే టెండరు విధానం లేకుండానే నిధులు ఖర్చు చేయడం వెనుక చక్రం తిప్పిన వ్యవహారాన్ని సైతం అధికార పార్టీకే చెందిన కౌన్సిలర్ ప్రశ్నిస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు అందజేసే సబ్బులు, ఆయిల్, యూనిఫాం తదితర వాటిని సంవత్సరకాలంగా పంపిణీ చేయలేదు. ప్రాణాలొడ్డి పారిశుధ్య పనులు చేస్తుంటే ప్రజాప్రతినిధులుగా వారికి సౌకర్యాలు కల్పించడంలో తాత్సారం చేస్తే ఏలా అని, సంవత్సరం నుంచి వస్తువులు ఇవ్వకపోవడం ఏమిటని కూడా అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా స్వపక్షంలోనే విపక్షంలా మారిన సభ్యులు అడిగే ప్రశ్నలకు అధికారులు, చైర్మన్, వైస్‌చైర్మన్లు సమాధానం చెప్పలేకపోతున్నారు.

హాట్ టాఫిక్‌గా మారిన నిధుల డ్రా

మున్సిపల్ కార్యాలయ వ్యవహారంలో చెక్ పవర్ కీలక అధికారికే ఉంటుంది. కౌన్సిల్‌లో నిర్ణయాలు, ప్రతిపాదిత అంశాలపై ఆర్థిక పరమైన, విధాన పరమైన అంశాలకు మాత్రమే సమావేశాల్లో సభ్యులు ఆమోదముద్ర వేయడం జరుగుతుంది. అయితే టెండర్లు లేకుండానే నిధులు డ్రా చేసే విషయంలో అధికార కౌన్సిల్‌లోని కొందరు ముఖ్య సభ్యుల మద్దతు లేకుండా జరగదని, కుమ్మక్కు అయితే తప్ప నిధుల డ్రా జరిగే ప్రసక్తేలేదని క్రింది స్థాయి సిబ్బంది గుస గుసలాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నంద్యాల మున్సిపాలిటీలో హాట్ టాపిక్‌గా మారిన, టెండర్లు లేకుండానే రూ. లక్షలకు లక్షలు నిధుల డ్రా వెనుక ఏమి జరిగిందన్న విషయంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందా అన్న విషయం సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.



శ్వేత పత్రం విడుదల ఏమైంది?

టెండర్ లేకుండా చెల్లింపులు, పారిశుధ్య కార్మికులకు ఏడాది కాలంగా వస్తువులు అందజేయకపోవడం, మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని విస్తృత ప్రచారం నేపథ్యంలో శ్వేత పత్రం విడుదల అంశంపై అందరి దృష్టి నెలకొంది. మున్సిపాలిటీలో తెరవెనుక జరిగిన తతంగాన్ని అధికార పార్టీకే చెందిన కౌన్సిలర్ నిలదీయడంతో పాటు అవినీతి అక్రమాలకు పాల్పడిందెవరన్న ప్రజలకు తెలియాలని, ఈ విషయంపై శ్వేత పత్రాన్ని పది రోజుల్లోగా విడుదల చేయాలంటూ కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అయితే కమిషనర్ బదిలీ, కొత్త కమిషనర్ రాకతో శ్వేతపత్రం విడుదల అంశం త్రిశంకు స్వర్గంలో నిలిచిపోయింది. గతంలో జరిగిన లోగుట్టు వ్యవహారాలను కొత్త కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తే తప్ప తెరవెనుక అక్రమాల గుట్టు బయటకు వచ్చే పరిస్థితిలేదు. లోగుట్టు వెనుక చక్రం తిప్పిందెవరోనన్న విషయంపై కూడా వాస్తవాలు వెలుగులోకి రావని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అదంతా అవాస్తవం

- అర్చకుల పర్యవేక్షణలోనే ప్రసాదాల తయారీ
- శ్రీశైలం అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు

శ్రీశైలం, ఫిబ్రవరి 11: శ్రీశైల భ్రమరాంబికాదేవి అమ్మవారి ప్రసాదంలో ఎముక వచ్చినట్లు వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలని అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయశాస్త్రి, వేదపండితులు గంటి రాధాకృష్ణ శర్మ వెల్లడించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ... పాకశాలలో తయారు చేసే రోజూవారి ప్రసాదాలు నియమనిష్టలతో, శుచీశుభ్రతలతో ప్రధానార్చకుల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. అమ్మవారి ఆలయ ఆలయ ప్రాంగణంలో గల పాకశాలలో పులిహోర ప్రసాదంలో ఎముక వచ్చిందనేది వాస్తవం కాదన్నారు. ఈ ఘటన తమకు ఎంతో మనోవేదనకు గురి చేసిందన్నారు. దీనిపై పలు అనుమానాలు కూడా ఉన్నాయన్నారు. శ్రీశైలక్షేత్ర ప్రతిష్ఠను దెబ్బతీసి భక్తుల మనోభావాలను కించపరిచేందుకే ఇలాంటి వార్తలు వస్తున్నాయన్నారు. ఇలాంటి ఘటనలపై భక్తులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు.



వేదపండితులు గంటి రాధకృష్ణ శర్మ అవధాని, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయ శాస్త్రి

భక్తులకు ఇబ్బందులు రాకూడదు

శివరాత్రి ఉత్సవాలపై ఈఓ పెద్దిరాజు సమీక్ష

శ్రీశైలం, ఫిబ్రవరి 11: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి ఒకటో తేదీ నుంచి జరిగే శివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఈఓ డి.పెద్దిరాజు సిబ్బందిని ఆదేశించారు. ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఇంజనీరింగ్, ఉద్యాన విభాగం, మంచినీటి సరఫరా విభాగం అధికారులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. చంద్రావతి కల్యాణమండపం, శివదీక్షా భక్తుల క్యూలైన్లు, కైలాసద్వారం తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆలయ కార్యాల భవనంలోని సమావేశ మందిరంలో శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ పెద్దిరాజు

మార్గదర్శకులను ఎన్నుకోండి

- ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్
- కర్నూలులో 'ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్య పరిరక్షణ' సమావేశం
- అభిప్రాయాలను వెల్లడించిన మేధావులు

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 11: ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో సుపరిపాలన అందించే మార్గదర్శకులను ఎన్నుకునే విధంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ చైర్మన్, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్ అన్నారు. కర్నూలు నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం 'ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్య పరిరక్షణ' సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గాడిచర్ల సర్వోత్తమరావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కల్కూర చంద్రశేఖర్ తెలంగాణ రాష్ట్ర మాజీ సీఈసీ వి.నాగిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ, డెమోక్రసీ ఉపాధ్యక్షుడు ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఏపీ మాజీ సీఈసీ, డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి పోలంకి సుబ్బారాయన్ తదితర ముఖ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ జి.భవానీ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మంచితనం తగ్గిపోయిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ నైతికంగా పతనం అవుతోందన్న విషయాన్ని ఓటర్లు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. వ్యవస్థలు బాగుండాలంటే నాయకుల తీరును ప్రజలు గమనించాలన్నారు. సమాజం ఎటుపోతుందో అనే భావన నుంచి మేల్కొని ప్రజాస్వామ్యాన్ని ఓటు ద్వారా రక్షించాలన్నారు. కర్నూలు జిల్లా నుంచి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, దామోదరం సంజీవయ్య, ఎచక్రపాణి, కేబీ నర్సయ్య వంటి మహనీయులు చట్టసభలకు వెళ్లి మంచి పాలన అందించారన్నారు. కానీ ప్రస్తుతం ప్రజలకు మంచి పాలన అందించాలనే ఆలోచన ఏ నాయకుడికి రావడం లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ భవానీ ప్రసాద్

...వివరాలు 7లో

ఎండుమిర్చి క్వింటా రూ.26,229

ఐదు రోజుల్లో రూ.6వేలు పెరిగిన ధర

ఆదోని (అగ్రికల్చర్) ఫిబ్రవరి 11: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పతనమైన ఎండుమిర్చి ధరలు మళ్లీ పెరిగాయి. ఆదివారం రైతులు విక్రయానికి తెచ్చిన ఎండుమిర్చికి గరిష్ఠంగా క్వింటా రూ.26,299 చొప్పున పలికింది. మళ్లీ ధరలు పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బ్యాడిగి రకం ఎండుమిర్చి ధర క్వింటా ధర రూ.26,299, డాబా రకం ధర 18,009, కడ్డీ బ్యాడిగి రకం ధర రూ.15వేలు, సింజెంటా రకం ధర రూ.16,229 చొప్పున ధరపలికింది. అదేవిధంగా డీడీ రకం రూ.16,500, ఎన్ఎస్ రకం రూ.18,518, తేజ రకం రూ.18,050 పలికింది. 1,406 బస్తాల ఎండుమిర్చి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.5,500, గరిష్ఠ ధర రూ.26,229, మధ్యస్థ ధర రూ.11,000గా పలికింది.



ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు విక్రయానికి వచ్చిన ఎండుమిర్చి

సుపరిపాలకులను ఎన్నుకోండి



'ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్య పరిరక్షణ' సమావేశంలో మేధావులు, ప్రముఖులు

ఈ సదస్సులో డెమోక్రసి కోశాధికారి ఫాల్గునకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ రాంశంకర్‌నాయక్, ఐఆర్ఎస్ రఘు, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎల్లయ్య, ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు, లయన్స్ క్లబ్ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లలో సరళీకృతమైన ఆలోచనలు ఉండాలి



ప్రతి ఓటరు సరళీకృతమై ఆలోచన ఉంటేనే ప్రజాస్వామ్య వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. ఓటర్లలో గుణాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఇతర సంస్థలతో కలిసి రాజకీయాలకు అతీతంగా పనిచేస్తోంది. ఓటు వేసినప్పుడు మాత్రమే సుపరిపాలన కావాలని అడిగే నైతికహక్కు వస్తుంది. ఓటు వేయకపోతే ప్రశ్నించే హక్కు కోల్పోతారు. విద్యాధికులు తమ పౌర బాధ్యతలను నెరవేర్చడంలో మిగిలిన వారిక కంటే ముందు నిలబడాలి. ప్రస్తుత పాలకులు అందరూ కలెక్టర్, ఎస్పీని ఏ విధంగా ఇబ్బంది పెట్టాలి..? తుంగభద్ర నదిలో ఎంత ఇసుకను తోడుకోవాలి, బావమరిది, బంధువులకు ఎంత దోచిపెట్టాలనే దాని మీదనే దృష్టి పెట్టారు. ఓ మంత్రి శాసనసభలో ప్రవేశపెట్టిన చట్టం వల్ల ఏ జిల్లాకు నష్టం కలుగుతుందో కూడా తెలియని దుస్థితిలో నేతలు ఉన్నారు. 37 ఏళ్ల సర్వీసులో సుమారు 200 మంది ఎమ్మెల్యేలతో మాట్లాడాను. గుంటూరు వాసి వావిలాల గోపాలకృష్ణ ఎమ్మెల్యేగా ఎన్నో సేవలందించారు. ఆయన చనిపోయే సమయంలో నాకు ఫోన్ చేసి ఆల్‌మట్టి డ్యాంకు సంబంధించి ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అలాంటి నాయకులు ఎక్కడ కనిపించలేదు. ఇటీవల లాయర్లను ఇబ్బంది పెట్టే జీవోను తీసుకువచ్చారు. దాని గురించి అడిగితే మంత్రి తనకేమి తెలియదంటూ సమాధానం ఇచ్చారు. పనికిరాని వారిని నెత్తిన పెట్టుకున్నాం. రిటైర్డ్ అయిన ఐఏఎస్ అధికారులపై చార్జిషీటు దాఖలు చేసే దుస్థితికి మన రాష్ట్రం వచ్చింది. ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయిస్తే కోర్టు కూడా ప్రభుత్వ తీరును ఎండగడుతూ తీర్పు ఇస్తుంది. కొందరు ధనవంతులు కావడానికే రాజకీయాల్లోకి వస్తున్నారు. అలాంటి వారిని ప్రశ్నించే విధంగా ఓటర్లు చైతన్యవంతులు కావాలి.

\- ఎల్వీ సుబ్రహ్మణ్యం, మాజీ సీఎస్

ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



రాష్ట్రంలో సుపరిపాలన కోరుకునే ఓటర్లు విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ తక్కువగా నమోదు కావడం బాధాకరం. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు పౌర సమాజ సంస్థలు గట్టిగా కృషి చేయాలి. ప్రజా జీవితంలో గుణాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఇతర సంస్థలతో కలిసి రాజకీయాలకు అతీతంగా చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. ప్రపంచంలో ఒకప్పుడు ఆర్థికపరంగా బాగున్న వెనిజులా దేశంలో నేడు ఆర్థికవ్యవస్థ పూర్తిగా పతనమైంది. విద్యావంతులు ఓటును వినియోగించుకోకపోవడం వల్లే అక్కడ ఆ పరిస్థితి ఏర్పడింది. కొందరు పార్టీని చూసి, మరికొందరు వ్యక్తిని చూసి, మరి కొందరు డబ్బు, మద్యానికి బానిసలై ఓటు వేస్తున్నారు. ఇకపై అలా ఉండకూడదు. ఎన్నుకున్న ఎమ్మెల్యే, ఎంపీ మన నియోజవర్గానికి ఏమి చేశారో ప్రశ్నించే తత్వం ప్రతి ఒక్కరిలోనూ రావాలి.

\- వి.నాగిరెడి, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్ఈసీ

ఓటు హక్కు ఎంతో విలువైనది



ఓటు హక్కు ఎంతో విలువైనది. ఇటీవల సుప్రీంకోర్టులో ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సుదీర్ఘ వాదనలు జరిగాయి. న్యాయవాది జస్టిస్ కస్తోగి ఓ అడుగు ముందుకేసి ఓటు హక్కు ప్రాథమిక హక్కుగానేకాకుండా ప్రాథమిక బాధ్యతగా తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు తీసుకోకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే దాని మీద ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఇటీవల ఉపాధ్యాయుల ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నిబంధనలకు ఉల్లంఘన జరిగితే డెమోక్రసీ తరపున ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తున్నాం. దీని కోసం ఎన్నికల కమిషన్ ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ పట్టణ ప్రాంతాల్లో విద్యావంతులు ఓటింగ్‌కు వెళ్లకపోవడం బాధాకరం. పౌరులంతా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తున్నాం.

\- నిమ్మగడ్డ రమేష్‌కుమార్, మాజీ ఎస్ఈసీ

బుల్లెట్ కంటే పవర్‌ఫుల్ బ్యాలెట్



బుల్లెట్ కంటే పవర్‌ఫుల్ బ్యాలెట్. నిరక్షరాస్యుల వల్ల ప్రజాస్వామ్యానికి చెడ్డపేరు వస్తుందని చెబుతున్నారు. అది చాలా తప్పు ఓటు వినియోగించుకోని అక్షరాస్యుల వల్ల సమాజంలో విలువలు లేకుండా పోతున్నాయి. ఓటు వేయని వారికి ప్రశ్నించే అధికారం లేదు. గాంధీజి కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని స్థాపించడానికి కృషి చేయాలి. బ్రిటీష్ ప్రభుత్వం గ్రామ,మున్సిపాలిటీలకు ఇచ్చిన చట్టాలు ప్రస్తుతం ప్రభుత్వాలు ఇవ్వడం లేదు.

\- కల్కూర చంద్రశేఖర్

బడ్జెట్‌ను ప్రభావితం చేసేదే ఓటు హక్కు



కేంద్ర రాష్ట్రాల్లో ప్రవేశపెట్టే కోట్ల బడ్జెట్‌ను ప్రభావితం చేసే విధంగా ఓటు హక్కు ఉంటుంది. ఓటు విలువ ఎన్ని లక్షలు ఉంటుందో ఎవరికి తెలియదు. ఒక్క ఓటుతో ఎమ్మెల్యే ముఖ్యమంత్రిగా, పార్లమెంటు సభ్యుడు ప్రధానమంత్రిగా కావచ్చు. ప్రతి ఓటరు ఎలాంటి వ్యక్తిని ఎన్నుకోవాలో ఆలోచించుకోవాలి. కళాశాలల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వాలు క్రీడలు జరిపేటప్పుడు ఖచ్చితంగా ఓటరు కార్డు ఉంటేనే క్రీడల్లో పాల్గొనాలని నిర్దేశించాలి. ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి బాధ్యత

\- సుబ్బరంగయ్య, లెట్అస్ ఓటు సంస్థ వ్యవస్థాపకుడు

ఓటర్లను చైతన్యవంతులను చేస్తాం



ఓటు వినియోగంతో ఉత్తమ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పవచ్చు. గ్రామ,గ్రామాల్లో ఓటర్లను చైతన్యవంతులు చేసేందుకు కృషి చేస్తాం. ఇప్పటి వరకు మా పొదుపు సంఘం ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి ప్రస్తావించలేదు. ఓటు విలువలపై ప్రతి గ్రామంలో కళాజాత బృందాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తాము. గ్రామ గ్రామాన వెళ్లి ఓటు ఆవశ్యకతను వివరిస్తాం.

\- విజయభారతి, ఓర్వకల్లు

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

తొలిరోజు 187 మంది గైర్హాజరు

కర్నూలు(ఎడ్యుకేషన్)ఫిబ్రవరి 11: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సు సైన్స్ ప్రయోగ(ప్రాక్టికల్స్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 92 కేంద్రాల్లో పరీక్షలు కొనసాగాయి. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్స్ మధ్యాహ్నం 2నుంచి, సాయంత్ర 5 గంటల వరకు జరిగాయి. మొత్తం విద్యార్థులు 6,243 మందికిగాను, 6,056 మంది హాజరు కాగా, తొలిరోజు 187 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షలకు 3,444 మందికిగాను 3,339 మంది హాజరుకాగా, 105 మంది గైర్హాజరయ్యారు, అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 2,799 మందికిగాను, 2,717 మంది హాజరుకాగా, 82 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ గురువయ్యశెట్టి వెల్లడించారు. పరీక్షలను డీవీఈవో జమీర్ పాషా, డీఈసీ సభ్యులు పరమేశ్వర రెడ్డి, జి.లాలెప్ప, ప్రభు పర్యవేక్షించారు.

ఇద్దరు ఎస్ఐలకు స్థానచలనం

కర్నూలు, ఫిబ్రవరి 11: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు ఎస్ఐలకు పోలీసు ఉన్నతాధికారులు స్థానచలనం కల్పించారు. ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పని చేస్తున్న కృష్ణమూర్తిని మాధవరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎస్ఐ కిరణ్‌బాబును నంద్యాల జిల్లా అవుకు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఆ కార్పొరేటర్‌పై మరో కేసు నమోదు

కర్నూలు, ఫిబ్రవరి 11: కర్నూలు పరిధిలోని శరీన్‌నగర్ కార్పొరేటర్ జయరామ్, ఆయన సోదరులు, తండ్రిపై ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మరో కేసు నమోదైంది. మూడు రోజుల క్రితం రౌడీ షీటర్ ప్రభాస్ అలియాస్ గర్జి మీద కార్పొరేటర్ జయరామ్ ఆయన సోదరులు దాడి చేశారు. దీంతో ప్రభాస్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం తనపై వారు దాడి చేయలేదంటూ ప్రభాస్‌తో కొంతమంది బలవంతంగా మీడియాతో స్టేట్‌మెంట్ ఇప్పించారు. తర్వాత కొద్దిసేపటికే ప్రభాస్ మరోసారి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంజన్న, అతని కుమారులు తనను బలవంతంగా కిడ్నాప్ చేసి బలవంతంగా వీడియో చిత్రీకరించినట్లు ఫిర్యాదు చేశాడు. ప్రభాస్ ఫిర్యాదు మేరకు సంజన్న, ఆయన కుమారులు జయరామ్, కరుణాకర్, అఖిలతో పాటు మరి కొంత మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత వైసీపీలో కీలకంగా ఉంటున్న సంజన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. అయితే సంజన్న టీడీపీలో చేరుతున్నట్లుగా వార్తలు వస్తున్న తరుణంలో వరుస కేసులు నమోదు చేయిస్తున్నట్లు నగరంలో చర్చనీయాంశంగా మారింది.

'దిశా' డీఎస్పీగా బాబు ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన దిశా డీఎస్పీగా బాబు ప్రసాద్

కర్నూలు, ఫిబ్రవరి 11: దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బాబు ప్రసాద్ ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పని చేస్తూ ఇటీవలే కర్నూలు ఆయన బదిలీ అయ్యారు. బాబు ప్రసాద్ సీఐగా కర్నూలు టూటౌన్, ఆత్మకూరు, కర్నూలు స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పని చేశారు. డీఎస్పీగా కర్నూలు స్పెషల్ బ్రాంచ్, నెల్లూరు జిల్లా గూడూరు పోలీస్‌స్టేషన్‌లో పని చేశారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా తాను పనిచేస్తానని బాబు ప్రసాద్ వెల్లడించారు.

మల్లన్న సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ ఇందిరేష్

శ్రీశైలం, ఫిబ్రవరి 11: శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను ఆదివారం రాత్రి కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇందిరేష్ దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి స్వామికి అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత భ్రమరాంబికాదేవిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు జడ్జికి వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఓపీఎస్‌ను సాధించి తీరుతాం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు
- కర్నూలులో ప్రారంభమైన స్వర్ణోత్సవాలు

కర్నూలు (ఎడ్యుకేషన్) ఫిబ్రవరి 11: ప్రభుత్వం మెడలు వంచి ఓపీఎస్‌ను సాధించుకుంటామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. యూటీఎఫ్‌లో కొనసాగుతూ అమరులైన కుటుంబాలకు సంఘం అండగా నిలుస్తుందన్నారు. ఆదివారం నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్వర్ణోత్సవ లోగోను ఆవిష్కరించి ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ సంఘం తొలి జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్ర విద్యాసంస్థ అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ అంకితత్వం, ఉద్యమ స్ఫూర్తి ఒక్క యూటీఎఫ్‌కే సాధ్యమన్నారు. పోరాటాలతోనే ఉపాధ్యాయుల ప్రయోజనాలు వస్తాయన్నారు. రాష్ట్ర సహాధ్యక్షుడు కందుకూరి సురేష్ కుమార్ మాట్లాడుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాలు ఏడాదంతా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయన్నారు. సభలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ రచించిన స్వర్ణోత్సవ సంబరాల గేయాన్ని ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు బసవరాజు ఆలపించారు. యూటీఎఫ్‌లో నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ గౌరవాధ్యక్షుడు నరసింహులు, కోడుమూరు మాజీ ఎంఈవో నాగభూషణం శెట్టి, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, నాయకులు నాగమణి, ఎల్లప్ప, సుధాకర్, రామాంజనేయులు, జేవీవీ సుధీర్ రాజు, ఎస్ఎం జయరాజు, యేహోషువా తదితరలు పాల్గొన్నారు.



జి.పుల్లయ్యను సన్మానిస్తున్న యుటీఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న నక్క వెంకటేశ్వర్లు

ప్రసూతి వార్డులో అవస్థలు

- చీకట్లో మగ్గిన చిన్నారులు, బాలింతలు
- కోసిగి ప్రభుత్వాసుపత్రిలో కరెంటు కోత
- ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం



కోసిగిలో చీకట్లో ప్రసూతి వార్డు

కోసిగి, ఫిబ్రవరి 11: కోసిగి ప్రభుత్వాసుపత్రిలో కరెంటు లేక పసిబిడ్డలు, బాలింతలు శనివారం రాత్రి 11 గంటల తర్వాత తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బాలింతలు, గర్భిణులు కరెంటు లేక ఆసుపత్రుల్లో చీకట్లోనే సతమతమయ్యారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపంతో ఆసుపత్రిలోని వైరింగ్ కాలిపోయింది. దీంతో సుమారు 5 గంటల పాటు గర్భిణులు, బాలింతలు అల్లాడిపోయారు. అప్పుడే పుట్టిన శిశువులకు ఫ్యాన్లు తిరగకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. బంధువులు సెల్ టార్చులైటు వెలుతురులో చీర కొంగుతో ఊపుతూ పసిబిడ్డలకు గాలి పట్టారు. అప్పుడే పుట్టిన శిశువులు, బాలింతల బాధ వర్ణనాతీతం. కాన్పు అయిన గంటకే బాలింతలను రాత్రి 11 గంటల సమయంలో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఇంటికి పంపించేశారు. ఈ విషయంపై వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌కుమార్‌ను వివరణ కోరగా... ఆసుపత్రి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై కోతి పడడంతో ఆసుపత్రిలోని వైరింగ్ కాలిపోయిందన్నారు. విద్యుత్ అధికారులు వచ్చినప్పటికి సమస్య పరిష్కారం కాలేదని, అందుకే గర్భిణులు, బాలింతలను ఇంటికి పంపించామన్నారు.

కల్యాణవేదికపై రక్తదానం

- ఆదర్శంగా నిలిచిన వరుడు
- తనతో పాటు 20 మంది స్నేహితులు కూడా



వధూవరులు వెంకట హరీష్, అనూష

మహానంది, ఫిబ్రవరి 11: రక్తదానం చేయాలంటూ నిత్యం ఎవరో ఒకరు వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తుంటారు. కానీ నంద్యాల జిల్లా మహానందిలో మాత్రం ఓ యువకుడు విభిన్నంగా ఆలోచించాడు. ఏకంగా తన పెళ్లిరోజున కల్యాణవేదికపై ఏకంగా రక్తదానం చేసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. అంతేకాదు తన 20 మంది స్నేహితులతో కూడా రక్తదానం చేయించి ఆదర్శంగా నిలిచాడు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తెలుగు వెంకట హరీష్, ప్రకాశం జిల్లా రాచర్ల గ్రామానికి చెందిన అనూషకు ఆదివారం మహానందిలో వివాహం జరిగింది. అయితే తన వివాహ వేడుకల్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయాలని వరుడు హరీష్ ముందుగానే నిర్ణయించుకుని అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేశాడు. వివాహం తంతు పూర్తయ్యాక మొదటగా తనే రక్తదానం చేశాడు. తర్వాత తన 20 మంది స్నేహితులతో రక్తదానం ఇప్పించాడు. సేకరించిన రక్తం శాంపిళ్లను వైద్య సిబ్బంది నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా వెంకట హరీష్ క్యాన్సర్ పేషేంట్ల కోసం తన వెంట్రుకలను 12 సెంటిమీటర్లు పెంచి కేశదానం చేశాడు. తమ వివాహం రోజున ప్రజలకు ఉపయోగపడేలా ఏదైనా కార్యక్రమం చేయాలన్న లక్ష్యంతోనే ఇలా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయించినట్లు హరీష్ దంపతులు తెలిపారు.



కల్యాణ మండపంలో రక్తదానం చేస్తున్న హరీష్ స్నేహితులు

వివాహిత ఆత్మహత్య

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 11: అత్తింటి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రామకృష్ణాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మానస(27) ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా... ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లికి చెందిన మానసకు రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గంగాధర్‌తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు సంతానం. అయితే గత కొంతకాలంగా మానసను అదనపు కట్నం కోసం భర్త గంగాధర్, కుటుంబ సభ్యులు వేధించేవారు. సూటిపోటి మాటలతో ఆమెను మానసికంగా ఇబ్బందులకు గురి చేశారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన మానస శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మానస ఆదివారం మృతి చెందింది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు భర్త గంగాధర్‌తో పాటు కుటుంబ సభ్యులు రామచంద్ర, నాగరత్నమ్మ, రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మనస్తాపంతో మహిళ బలవన్మరణం

దేవనకొండ, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని దేవనకొండ టర్నింగ్‌లో నివాసం ఉంటున్న ఉప్పరి లక్ష్మి(30) అనే మహిళ మనస్తాపంతో ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త ఉప్పరి క్రిష్ణ గ్రానైట్‌బండలు పరిచే పని నిమిత్తం రెండు రోజులు క్రితం పనికి వెళ్లాడు. ఇంట్లో తన ఇద్దరు కుమారులతో ఉన్న లక్ష్మి తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఈక్రమంలో శబ్దం రావడంతో పిల్లలు లేచి చుసేసరికి ఫ్యాన్‌కు లక్ష్మి వేలాడుతూ కనిపించింది. చిన్నారులు చుట్టుపక్కల వారిని పిలుచుకువచ్చేలోగా ఆమె మృతి చెందింది. కొంత కాలంగా లక్ష్మి తల,కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేదని భర్త కేశన్న తెలిపాడు. ఎన్నో ఆసుపత్రులకు వెళ్లినా ఆమె ఆరోగ్యం కుదుటపడలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

శాస్త్రవేత్తలుగా ఎదగాలి: డీఈవో



నమూనాను పరిశీలిస్తున్న డీఈవో సుధాకర్‌రెడ్డి

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 11: విద్యార్థులు బావి భారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈవో సుధాకర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం నంద్యాలలోని సెయింట్ జోసఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఎగ్జిబిషన్ అండ్ ప్రాజెక్టు కాంపిటీషన్ ఇన్‌స్పైయర్ మానక్ అవార్డు కార్యక్రమం జరిగింది. డీఈవో సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఆదివారం, సోమవారం రెండు రోజులు ప్రదర్శన జరగనున్నట్లు డీఈవో తెలిపారు. జిల్లా స్థాయికి 173 ప్రాజెక్టులు ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేసి వాటి నుంచి 17 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. డిప్యూటీ ఈవో మహబూబ్‌బేగ్, జిల్లా సైన్స్ ఫేర్ అధికారి సుందర్‌రావు, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, దిశా కో ఆర్డినేటర్ నాగేంద్రకుమార్ డీఈవోతో పాటు కలిసి విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను పరిశీలించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సైన్స్ ఫేర్ లోగోను ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయాలని ఆదేశించారు.

రేపు శ్రీశైలంలో విద్యుత్ అవగాహన సదస్సు

ఆత్మకూరు, ఫిబ్రవరి 11: శ్రీశైలంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్‌డీసీఎల్, కర్నూలు రూరల్ డివిజన్ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారుల సమస్యలు, వాటి పరిష్కారాలపై అవగాహన కల్పించేలా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఛైర్మన్, రిటైర్డు జిల్లా జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి హాజరుకాన్నునట్లు తెలిపారు. 13న ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహించే సదస్సుకు విద్యుత్ వినియోగదారులు హాజరై తమ సమస్యలకు పరిష్కారాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 11: నంద్యాల కలెక్టరేట్‌లో వైఎస్సార్ సెంటినరీ హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ కె. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకంతా జిల్లా అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పాణ్యం సీఐగా నల్లప్ప బాధ్యతల స్వీకరణ



పాణ్యం, ఫిబ్రవరి 11: పాణ్యం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సి.నల్లప్ప ఆదివారం బాధ్యతలు చేపట్టారు. పాణ్యం సీఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు నంద్యాల ఎస్‌బీ-2కు బదిలీ అయ్యారు. నల్లప్ప కర్నూలు జిల్లా ఉలిందకొండ నుంచి పాణ్యానికి బదిలీ అయ్యారు. పాణ్యం ఎస్‌ఐ అశోక్, పోలీసు సిబ్బంది సీఐకి ఘన స్వాగతం పలికారు

'రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

గడివేముల, ఫిబ్రవరి 11: రాజకీయ పార్టీలు నూర్‌భాషల (దూదేకుల)కు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని నూర్‌భాష సంఘం జిల్లా అధ్యక్షుడు దస్తగిరి కోరారు. గడివేములలో ఆదివారం నూర్‌భాష సంఘం మండల నూతన కమిటీ ఎన్నికైంది. మండల అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ చిన్న జమాల్‌బాషా, ఉపాధ్యక్షుడిగా డాలుస్వామి, సెక్రెటరీగా దర్గా స్వామి, ట్రెజరర్‌గా మహబూబ్‌బాషా ఎన్నికయ్యారు. అనంతరం దస్తగిరి మాట్లాడుతూ నూర్‌భాషల సంఘానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. నూర్‌భాషలకు (దూదేకుల) చట్టసభల్లో అవకాశం ఇచ్చే రాజకీయ పార్టీకి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దూతేకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి, కోశాధికారి ఉసేనప్ప, జిల్లా యూత్ అధ్యక్షుడు గబ్బర్ దస్తగిరి తదితరులు ఉన్నారు.

'జగన్ ప్రభుత్వం ప్రచారం సిగ్గుచేటు'



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సావిత్రి

ఆత్మకూరు, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వ నిధులతో జగన్ ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, 'పల్లెకు పోదాం' కార్యక్రమం రాష్ట్ర కో కన్వీనర్ సావిత్రి అన్నారు. ఆదివారం ఆత్మకూరులోని ఆ పార్టీ కార్యాలయంలో బీజేపీ శ్రేణులతో సమావేశమైన పల్లెకు పోదాం కార్యక్రమ పురోగతి గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన అనేక పథకాల నిధులను జగన్ సర్కార్ తామే అన్ని చేస్తున్నట్లు స్టిక్కర్లు అంటించుకుని ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం పలు పథకాల అమల్లో ఎక్కడా కూడా కేంద్ర ప్రభుత్వ ఊసే లేకుండా చేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఈవిషయాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిపేందుకు బీజేపీ ప్రతిష్టాత్మకంగా పల్లెకు పోదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఫిబ్రవరి 9,10,11 తేదీల్లో ఆయా గ్రామాల్లో తమ పార్టీ శ్రేణులు పర్యటించి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆయా గ్రామాలకు అందిన సహకారంతో పాటు ప్రజలకు ఇంకా ఏం చేస్తే బాగుంటుందన్న విషయాలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నటేష్, విశ్వరూపాచారీ, మౌలిబాషా, సుదర్శన్, సాంబ, గోపాల్, శ్రీధర్‌గుప్తా, ఆవులరెడ్డి, శంకర్‌గౌడ్, అజ్మతుల్లా, సుబ్రమణ్యం, మహేష్, కాశీ తదితరులు ఉన్నారు.

'రాజకీయ చైతన్యం రావాలి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 11: మైనార్టీల్లో రాజకీయ చైతన్యం రావాలని, రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మోమిన్ అహ్మద్‌హుసేన్ అన్నారు. ఆదివారం ఎండబ్ల్యూ ఫంక్షన్ హాల్‌లో మైనార్టీల ఆత్మీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు రాజకీయాలకు అతీతంగా పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

కలుషిత నీరు సరఫరా..

● ఇస్కాల గ్రామంలో పైపులైన్ లీకేజీ ● రోగాలతో బాధపడుతున్న గ్రామస్థులు ● ఏళ్ల తరబడి పనిచేయని బోర్లు

పాములపాడు, ఫిబ్రవరి 11: నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో గ్రామంలో పైప్‌లైన్ల ద్వార సరఫరా చేసే తాగునీటి కొళాయిల్లో చెత్తతో కూడిన నీరు వస్తుండటంతో గ్రాస్థులు రోగాల బారిన పడుతున్నారు. ఇస్కాల గ్రామ శివార్లలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్దగల బోర్లలో మంచినీరు పుష్కలంగా ఉంది. అయితే నీటిట్యాంక్‌లు పంచాయతీ అధికారులు శుభ్రం చేయకపోవడం, బ్లీచింగు పౌడరు వాడక పోవడంతో ట్యాంక్‌లోని చెత్త, పాచి, కుళ్లలు వస్తుండటం, నీరు దుర్వాసనలు వెదజల్లుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఈ నీటిని వేడిచేసి తాగినా గొంతునొప్పి, దగ్గు, జ్వరాలతో గ్రామంలో దాదాపు ప్రతి ఇంటా రోగాల బారినపడి బాదపడుచున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివార్లలోని గ్రామ పంచాయతీకి చెందిన బావినుండి నీటిని వదులుతుంటారు. అయితే ఈద్గావద్ద భూమిలో పైపులైన్ పగిలి పోవడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా మారిపోయింది. పైగా మూడు రోజులకు ఒకసారి వదలడంతో పలుమార్లు గ్రామస్థులు సర్పంచ్, పంచాయతీ అధికార్లను ప్రశ్నించిన పట్టించుకోక పోవడంతో విసుగు చెందిన గ్రామస్థులు గత శుక్రవారం పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలిపారు. గ్రామంలో బీసీ కాలనీ, కుమ్మరి పేట, బలిజపేట, పింజరి పేట తదితర కాలనీలలో ఏళ్ల తరబడి మంచినీటి బోర్లు పనిచేయక పోవడం లేదు. గ్రామంలో సమస్యలపై పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసిన పట్టించుకోడని, పోన్లు చేసిన ఎత్తడని ఇటువంటి అధికారి తమ గ్రామానికి అవసరం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పనిచేయని బోరు



ఈద్గా వద్ద పైపులైన్ లీకైన దృశ్యం



కలుషిత నీటిని చూపుతున్న శ్రీనివాసులు

కలుషితనీటితో గొంతు నొప్పులు

కలుషిత నీరు తాగడం వల్ల రోగాల పాలవుతున్నాం. అధికారులు సమస్యలను పరిష్కరిం చాలి.

-శ్రీనివాసులు

పట్టించు కోవడం లేదు



ఏళ్ల గడుస్తున్న బోర్లను రిపేరు చేయించడం లేదు. వీధి కొళాయిలలో కలుషిత నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడతున్నాం. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలి. - కలీముల్లా

సమస్యను పరిష్కరిస్తాం

ఇస్కాల గ్రామంలో తాగు నీటి సమస్య తమదృష్టికి వచ్చింది. ఈఓఆర్డీ సిబ్బందితో కలసి గ్రామంలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తాం.

- సరస్వతి, ఎంపీడీవో

వైభవంగా వాసవీమాత ఆత్మార్పణ దినం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 11: నంద్యాల మెయిన్ బజార్‌లో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆత్మార్పణ దినం కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం నిర్వహించారు. నంద్యాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస ఆధ్వర్యంలో, నూనెపల్లె అమ్మవారిశాలలో ఆత్మకూరు సుదర్శన శెట్టి ఆధ్వర్యంలో వాసవీమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 108 కలశాలతో కన్యలతో అభిషేక జలం తీసుకొని వచ్చి అమ్మవారికి అభిషేకం, నగరేశ్వరస్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం వాసవీమాతకు పంచామృత, పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, వాసవీ మహాయజ్ఞం, 102 మంది కన్యలతో లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ మహిళా మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినం ఆర్యవైశ్యులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాతఃకాల సమయంలోనే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజాక్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టారు. అలాగే వాసవీమాత ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. అంతేకాకుండా మహిళలు సామూహిక కుంకుమార్చనలు జరిపారు.



నంద్యాల, ఆత్మకూరులో ప్రత్యేక అలంకారంలో వాసవీమాత

రక్తదాన శిబిరం



రక్తదాతను అభినందిస్తున్న ప్రముఖులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 11: నంద్యాల ఆయుష్ యోగా కేంద్రం నిర్వాహకుడు ఆనంద్ గురూజీ నిర్వహణలో ఆదివారం రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, ఐఎంఏ అధ్యక్షుడు డా.ఫణిల్ కుమార్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ దస్తగిరి, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, తదితరులు హాజరై జ్యోతి ప్రజల్వన చేసి రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 42 మందికి పైగా రక్తదానం చేశారు. రక్తదాతలకు వినూత్న రీతిలో రక్తదాతలు వారికి వారే స్పందించే రీతిలో పలురకాల ప్రోత్సాహకాలు అందించారు. ముఖ్య అతిధులు మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా సేవాభావంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్పవిషయం కాదని మాసహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. అనంతరం శాంతిరాం హాస్పటల్ సహకారంతో 150 మందికి ఈసీజీ, 2డి ఎకో, బీపీ, షుగర్, కిడ్నీ పరీక్ష,కంటిపరీక్షలు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

నెహ్రూనగర్‌లో 'పల్లెకు పోదాం'



'పల్లెకు పోదాం' కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గోస్పాడు, ఫిబ్రవరి 11: గోస్పాడు మండలం నెహ్రూనగర్‌లో బీజేపీ చేపట్టిన పల్లె నిద్ర కార్యక్రమం ఆదివారం జరిగింది. నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు, నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ పెద్దలతో కలిసి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం తమ పేరు పెట్టుకొని గొప్పలు చెప్పుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధు, కశెట్టి చంద్రశేఖర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, ఫిబ్రవరి 11: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవాన్ని నిర్వహించారు.

మహానందిలో భక్తుల రద్దీ



మహానందిలో క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

మహానంది, ఫిబ్రవరి 11: మహానంది క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజు కావడంతో పాటు పెళ్లి ముహూర్తాలకు మంచి రోజు కావడంతో క్షేత్రంలో పదుల సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఒక వైపు భక్తులతో పాటు పెళ్లి బృందాలతో మహానంది పరిసరాలు వేలాదిమందితో కిటకిటలాడాయి. మహానందీశ్వరుని దర్శనం కోసం గంటల కొద్ది క్యూలో నిల్చున్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తారా? ఇళ్లకు పంపుతారా?

● ప్రిన్సిపాల్‌తో విద్యార్థినుల తల్లిదండ్రులు వాగ్వాదం

పగిడ్యాల, ఫిబ్రవరి 11: పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరిస్తారా? లేదంటే తమ పిల్లలను ఇండ్లకు పంపుతారా? అని డాక్టరు బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవణమ్మతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం వాగ్వాదానికి దిగారు. లక్ష్మాపురం అంచె సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలకు ఆదివానం వివిధ ప్రాంతాల నుంచి తమ పిల్లలను చూసేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చారు. పాఠశాలలో నీటి సమస్య తలెత్తడంతో తాగేందుకు కూడా నీరు లేకపోవడంతో సమీపంలోని రైతుల పొలాలలోని బోర్ల వద్దకు వెళ్లి నీటిని తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలలో రెండు, మూడు రోజులకు ఒకసారి నీరు వస్తుండటంతో బాటిళ్లలో నింపుకొని తాగుతున్నామని విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలిపారు. స్నానం చేసేందుకు, మరుగుదొడ్డకు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అలాగే 6వ తరగతికి చెందిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు కాళ్లు పట్టించుకుంటున్నారని, సమీపంలో ఉంటున్న సిబ్బంది పిల్లలతో సొంత పనులు చేయించుకోవడంతో చదువులో వెనుకబడుతున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ రవణమ్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ నుంచి పైపులైన్ పనులు చేపట్టామని చెప్పారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు కాళ్లు పట్టించుకోవడం తమ దృష్టికి వచ్చిందని, ఆ ఉపాధ్యాయురాలికి మెమో ఇచ్చామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఉన్నతాదికారుల దృష్టికి తీసుకోనిపోతామని చెప్పారు.



లక్ష్మాపురం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవణమ్మతో వాగ్వాదానికి దిగిన విద్యార్థినుల తల్లిదండ్రులు

'వైసీపీకి గుణపాఠం తప్పదు'



బైరాపురం గ్రామంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 11: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ప్రజల నుంచి గుణపాఠం తప్పదని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. ఆదివారం ఉదయం పట్టణంలోని 17వ వార్డు సాయిబాబ పేటలో టీడీపీ నాయకులు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమం పేరుతో రూపాయి ఇస్తూ.. నిత్యావసర వస్తువులపై రూ.10 వసూళ్లు చేస్తున్నారని ప్రజలు చెబుతున్నారన్నారు. పట్టణంలో వైసీపీ నాయకుల తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి ముర్తుజావలి, జకీర్ హుస్సేన్, షకీల్ అహ్మద్, రమణారెడ్డి, జనార్దన్, మల్లికార్జున రెడ్డి, బషీర్, నిమ్మకాయల రాజు తదితరులు పాల్గొన్నారు.

● మిడ్తూరు మండలం బైరాపురం గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య మాట్లాడుతూ టీడీపీ ప్రవేశపెట్టబోయే పథకాలతో ప్రజల సంక్షేమం సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, చాకర్‌వలి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన



వసంత పంచమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 11: ఈ నెల 14న కొలనుభారతిలో జరిగే వసంత పంచమి ఏర్పాట్లను ఆదివారం సీఐ నాగభూషణ్, ఈవో మోహన్, ఇన్‌చార్జి ఎస్‌ఐ అశోక్, పాలక మండలి ఛైర్మన్ వెంకటనాయుడు, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, వీఆర్వో బాబు మియా పరిశీలించారు. సరస్వతి అమ్మవారి పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ ఇన్‌చార్జి ఎస్‌ఐ అశోక్, సిబ్బందికి సూచించారు. ముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సీఐ ఈ ఏర్పాట్లపై ఈవో మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. కొలనుభారతికి వచ్చే భక్తుల వాహనాలను శివపురం గూడెం వద్దనే నిలిపివేసి అక్కడి నుంచి కొలనుభారతికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపితే.. ట్రాఫిక్ జామ్ కాకుండా ఉంటుంద తెలిన్నారు. పోలీసు బందోబస్తు ఏయే ప్రాంతాలలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఈవో మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ వేడుకలకు పదివేలకు పైగా భక్తులు వస్తారని, అందుకు తగ్గ బందోబస్తు నిర్దేశించిన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ఈవో మోహన్ సీఐని కోరారు. వీఐపీల వాహనాలు, మోటారు సైకిళ్లు, సాధారణ భక్తుల వాహనాలను ఏయే ప్రాంతాల్లో పార్కింగ్ చేయాలనే వాటిపై సీఐ క్షేత్ర స్థాయిలో పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మాజీ సర్పంచులు ఎర్రం శ్రీనివాసులు, రామకృష్ణ, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పురోహితులు చక్రపాణి శర్మ, రామయ్యశర్మ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

శ్రీశైల ధర్మకర్తల మండలి సభ్యుడిగా రామ్మోహన్ నాయుడు



ఈవో పెద్దిరాజును కలిసిన రామ్మోహన్ నాయుడు

శ్రీశైలం, ఫిబ్రవరి 11: శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల దేవస్థానం ఆలయ ధర్మకర్తల మండలి నూతన సభ్యునిగా అన్నమయ్య జిల్లాకు చెందిన బొల్లినేని రామోహన్ నాయుడుని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆదివారం బొల్లినేని రామోహన్ నాయుడు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

చెక్కుల అందజేత

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 11: జూపాడుబంగ్లాలో ఆదివారం వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బైరెడ్డి సిద్దార్థరెడ్డి పాల్గొన్నారు. అనంతరం పొదుపు మహిళలకు ఆసరా చెక్కును పంపిణీ చేశారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి బైరెడ్డి సిద్దార్థరెడ్డి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నూర్జహాన్, ఎంపీపీ సువర్ణమ్మ, ఏపీఎం అంబమ్మ, జెడ్పీటీసీ జగదీశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నాలుడో విడుత ఆసరా పథకం కింద మంజూరైన చెక్కులను ఆదివారం రాష్ట్ర శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిదార్థరెడ్డి అందజేశారు. 757 పొదుపు సంఘలకు మంజూరైన రూ. 6. 82 కోట్లు చెక్కును పొదుపు మహిళలకు అందజేశారు. జడ్పీటీసీ పుల్యాల దివ్య, సర్పంచ్ శేషన్న, ఎంపీటీసీ స్వాములు, ఎంపీడీవో కవిరాజు, ఎంఈవో సుబాన్, ఈవోఆర్డి నాగేంద్రమయ్య, ఏపీఎం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పేరుకుపోయిన పాచి

● మినీ ట్యాంక్‌ల వద్ద పొంచి ఉన్న ప్రమాదం

● జారి కింద పడుతున్న ప్రజలు

మహానంది, ఫిబ్రవరి 11: మండలంలోని తమ్మడపల్లి ఓసీ కాలనీలో నిర్మించిన రక్షిత మంచినీటి మినీ ట్యాంక్ వద్ద గత కొన్ని నెలలుగా పాచి పేరుకొని పోయింది. ప్రజలకు నీటి సరఫరా చేసే ట్యాంక్‌ల వద్ద గతంలో డ్రై డే పాటించి ప్రతి మంగళవారం, శుక్రవారాల్లో పంచాయతీ సిబ్బంది మినీ ట్యాంక్‌లను శుభ్రం చేసేవారు. నిధుల కొరతతో గత కొద్ది నెలలుగా డ్రై డేకు పంచాయితీ అధికారులు మంగళం పలికారు. దీంతో గ్రామాల్లోని నీటి ట్యాంక్‌ల వద్ద పాచి పేరుకొని పోయింది. దీంతో తాము అనారోగ్యానికి గురి అవుతున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాచి పేరుకుపోవడంతో ప్రజలు జారి కిందపడి ప్రమాదానికి గురవుతున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిధులను మంజూరు చేసి గ్రామాల్లో అపరిశుభ్రతను తొలగించాలని వారు కోరుతున్నారు.



తమ్మడపల్లిలో రక్షిత థానీటి ట్యాంక్ వద్ద పేరుకొని పోయిన పాచి

పోస్టులను భర్తీ చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కోవెలకుంట్ల ఫిబ్రవరి 11: ప్రభుత్వం 6100 పోస్టుల భర్తీకి ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేసి, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో వేలకొద్దీ టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే 6100 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం సబబు కాదన్నారు. మెగా డీఎస్సీ కోసం రీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో నిరుద్యోగుల సత్తా ఏమిటో ప్రభుత్వానికి చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కత్తిఓబులేసు, నాగరాజు, హరిబాబు, సుబ్బయ్యనాయుడు పాల్గొన్నారు.

నిరుద్యోగులను వంచించిన వైసీపీ ప్రభుత్వం


మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

డోన్(రూరల్), ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేసిందని డోన్ జనసేన నాయకులు ఆలా మోహన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల అంటూ కేవలం 6వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను వంచించడమేనని ఆరోపించారు. రాష్ట్రంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారుస్తున్న సీఎం జగన్‌కు వచ్చే సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు సీఎం స్థానం నుంచి ఆయనను మార్చడానికి సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. నిరుద్యోగులకు జనసేన అండగా ఉంటుందన్నారు. సమావేశంలో జనసేన నాయకులు రాయల్ మల్లికార్జున, పరదేశి మహేష్, గణేష్, జంగాల మహేష్, భాస్కర్, వెంకటనాయునిపల్లె రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కుంభాభిషేకం పూజలు

బనగానపల్లె, ఫిబ్రవరి 11: బనగానపల్లె మండలం నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీమాత ఆలయంలో కుంభాభిషేక వేడుకలు రెండో రోజు ఆదివారం ఈవో రామనుజన్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉదయం స్వస్తివాచనం, నవగ్రహ యోగిని, కుంభారాధనం, శ్రీచక్రార్చన, మహాగణపతిహోమం, హోమాలు, నవచండీహోమం, పూర్ణాహుతి, యాగమండప బలి, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కుంభాభిషేకం సందర్భంగా ఆలయం విద్యుత్ దీపాలంకరణలతో కళకళలాడింది. భక్తులు కుంభాభిషేకంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

● చౌడేశ్వరీమాత ఆలయంలో నిర్వహిస్తున్న కుంభాభిషేకం అనంతరం ఆలయ పరిసర ప్రాంతాల్లో జంతుబలులు నిషేధించినట్లు ఆలయ ఈవో రామానుజన్ ఆదివారం తెలిపారు. కుంభాభిషేకం అనంతరం 16 రోజుల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చౌడేశ్వరీమాతకు జరుపనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు మహాకుంభాభిషేకం విజయవంతం చేసి జంతుబలుల నిషేధానికి సహకరించాలని ఆయన కోరారు.

మాజీ సైనికోద్యోగులకు రూ.50వేలు విరాళం



మాజీ సైనికులకు విరాళం అందిస్తున్న గురురాజా సంస్థ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి

కోవెలకుంట్ల ఫిబ్రవరి 11: కోవెలకుంట్ల పట్టణంలో మాజీ సైనికులు ఏర్పాటు చేస్తున్న సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి గురురాజా మిత్రమండలి తరుపున వ్యవస్థానక అధ్యక్షుడు గురురాజా, ఆయన తరపున సంస్థ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం రూ.50వేలు విరాళంగా అందించారు. గుద్దేటి ప్రతాప్‌రెడ్డి, రమేశ్, గౌతంరాజు, ప్రతాప్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, అహమ్మద్‌హుసేన్, పెద్దిరెడ్డిలు కలసి సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండడంతో ఈ విరాళం అందించారు. విరాళం అందించిన దాత గురురాజాను మాజీ సైనికోద్యోగులు అభినందించారు.

ఫోర్‌లైన్ విజేత రాయల్ జట్టు

చాగలమర్రి, ఫిబ్రవరి 11: చాగలమర్రి రాయలకేఫ్ సమీపంలోని క్రీడా మైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చాగలమర్రికి చెందిన రాయల్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా మార్కెట్ లెవెన్ జట్టు విజయం సాధించింది. నిర్వాహకులు సలీమ్, తాహిర్, వాజిద్ మాట్లాడుతూ విజేతలైన రాయల్ జట్టుకు మొదటి బహుమతి రూ.20 వేలు నగదును దాత చక్రం బీడీ షబ్బీర్, రెండో స్థానంలో నిలిచిన మార్కెట్ లెవెన్ జట్టుకు రూ.10 వేలు నగదును గోల్డ్‌స్మిత్‌లు జమాల్, షరిఫ్, మూడవ స్థానంలో రాణించిన రైజింగ్ స్టార్ జట్టుకు రూ.5 వేలు రాయల్‌కేఫ్ రఫి, నాల్గోవ స్థానంలో రాణించిన సునిల్ జట్టుకు రూ.3,500 దాత ముల్లా శ్యాబుల్, మ్యాన్‌ఆఫ్‌ది టోర్నమెంట్‌కు ఎంపికైన సునిల్‌కు రూ.3 వేలు దాత ఆకుల ఇర్షాద్ అందజేశారు.

ధర్మప్రచారం అందరి బాధ్యత

చాగలమర్రి, ఫిబ్రవరి 11: ధర్మప్రచారం అందరి బాధ్యతని పీఠాధిపతి శంకరానందస్వామి అన్నారు. ఆదివారం చాగలమర్రి శివరామానంద ఆశ్రమంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు ధ్యాన చింతన కలిగిన ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధం


చింతలపేటలో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 11: రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన సీఎం జగన్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారనీ టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని చింతలపేట గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, మల్లయ్య, ఎల్ఐసీ శ్రీరాములు, కమలాపురం రమేష్, కొచ్చెర్వు రామాంజనేయులు, వలసల సుధాకర్, వెంకట్రాముడు, చిన్నన్న, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీకి పతనం తప్పదు: మాజీ మంత్రి


మాజీ మంత్రి అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

శిరివెళ్ల, ఫిబ్రవరి 11 : ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన వైసీపీకి పతనం తప్పదని టీడీపీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో టీడీపీ మినీ మేనిఫెస్టోలోని పథకాలను ఆదివారం ప్రజల్లోకి తీసుకెళ్లారు. వైసీపీ నాయకులు చేస్తున్న అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు టీడీపీని గెలిపించుకునేందుకు స్వచ్ఛందంగా పార్టీలోకి వస్తున్నారన్నారు. పార్టీపై, భూమా కుటుంబ నాయకత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అఖిలప్రియ అన్నారు. రాష్ట్రంలోని ప్రజల కష్టాలు తీరాలంటే టీడీపీ అధినేత నారా చంద్రబాబును సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కమతం జయరామిరెడ్డి, కమతం లక్ష్మిరెడ్డి, ఫుల్లారెడ్డి, సత్తారు లక్ష్మిరెడ్డి, సుబ్బారెడ్డి, బాలగురెడ్డి, శీలం లక్ష్మీప్రసాద్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిక

మండల కేంద్రమైన శిరివెళ్లలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన దర్గి మగ్బుల్, షేక్ వలి, సాదక్, కొండపల్లి మహమ్మద్, నూర్ బాషా, రబతం దాదా బాషా, హుసేన్ బాషా, షాకీర్, చాంద్ బాషా, బీ జాకీర్, అక్బర్, చిట్టి రఫి, రహిమాన్, షఫి, పుల్లయ్య, నడిపి రాంబాబు, చిన్న, సాయి తదితరులు వారి అనుచరులతో ముస్లిం మైనార్టీ నాయకులు బీసీ ఖాజా హుసేన్, బీసీ ఫిదా హుసేన్, బుగానిపల్లె అహ్మద్, సినిమాహాల్ కరీంల ఆధ్వర్యంలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఆమె భర్త భార్గవ్ రామ్ నాయుడు, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిల సమ

టీడీపీలోకి వైసీపీ నాయకుల చేరిక

క్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, యామా గుర్రప్ప, సూరా రామ, మహమ్మద్ హుసేన్, అబ్దుల్ అజీస్, బీఎండీ రఫి, నంద్యాల అబూబకర్ సిద్ధిఖ్, ఇస్మాయిల్, పీపీ లింగమయ్య, వేణుగోపాల్ రెడ్డి, శివరామిరెడ్డి, గంగదాసరి శ్రీనివాసరెడ్డి, రవిచంద్రారెడ్డి, బాలచంద్రుడు, రవి, ఉల్లి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

శిరివెళ్లలో టీడీపీ కార్యాలయాన్ని భూమా అఖిలప్రియ ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన దర్గి మగ్బుల్, షేక్ వలి, సాదక్, కొండపల్లి మహమ్మద్, రబతం దాదా బాషా, బీ జాకీర్, అక్బర్, రఫి, షఫి, పుల్లయ్య, నడిపి రాంబాబు తదితరులు వారి అనుచరులతో ముస్లిం మైనార్టీ నాయకులు బీసీ ఖాజా హుసేన్, బీసీ ఫిదా హుసేన్, బుగానిపల్లె అహ్మద్, సినిమాహాల్ కరీంల ఆధ్వర్యంలో అఖిలప్రియ, ఆమె భర్త భార్గవ్‌రామ్ నాయుడు, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, యామా గుర్రప్ప, సూరా రామ, మహమ్మద్ హుసేన్, అబ్దుల్ అజీస్, బీఎండీ రఫి, నంద్యాల అబూబకర్ సిద్ధిఖ్, ఇస్మాయిల్, పీపీ లింగమయ్య, వేణుగోపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి, గంగదాసరి శ్రీనివాసరెడ్డి, రవిచంద్రారెడ్డి, బాలచంద్రుడు, రవి, ఉల్లి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

బనగానపల్లె, ఫిబ్రవరి 11: టీడీపీలో చేరికలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వైసీపీ చేస్తున్న అరాచకాలను భరించలేక ఆ పార్టీ నుంచి టీడీపీలోకి వస్తున్నారు. కొలిమిగుండ్లలో వైసీపీకి చెందిన నాయకులు భారీగా ఆదివారం టీడీపీలో చేరారు. కొలిమిగుండ్ల పట్టణ ఉపసర్పంచ్ పెద్ద నాగయ్య ఆధ్వర్యంలో గిత్తన్నగారి నాగేశ్వరరావు, నాగకుళాయి, తలారి శ్రీనివాసులు, తలారి చెన్నకేశవ, తలారి చంద్రగోపాల్, తలారి చెన్నయ్యతో పాటు మరో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఉపసర్పంచ్ పెద్దనాగయ్య మాట్లాడుతూ బీసీ జనార్దన్‌రెడ్డి మంచితనం, కొలిమిగుండ్ల అభివృద్ధి కోసం పార్టీలో చేరామన్నారు. బనగానపల్లె నియోజకర్గం అభివృద్ధి చెందాలంటే


టీడీపీలో చేరిన వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బీసీతోనే సాధ్యమన్నారు. అందుకే వైసీపీని వీడినట్లు ఆయన తెలిపారు. 2024లో సీఎంగా చంద్రబాబునాయుడు, బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్‌రెడ్డిని గెలిపించుకోవడమే తమ ధ్యేయమన్నారు. బీసీ మాట్లాడుతూ టీడీపీలో చేరిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని బీసీ తెలిపారు.

టీడీపీతోనే బీసీల సాధికారత

చాగలమర్రి, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమని సీమాంధ్ర బీసీ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాష, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో పత్రాలను అందజేశారు. రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలోనాయకులు పాల్గొన్నారు.


చాగలమర్రిలో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

గిరిజనులు చైతన్య వంతులు కావాలి


గిరిజనుల సమావేశంలో పాల్గొన్న సంఘం నేతలు

ప్యాపిలి, ఫిబ్రవరి 11: గిరిజనులు అన్ని రంగాల్లో చైతన్య వంతులు కావాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భైరి ఓంకార్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఎస్ రంగాపురం గ్రామంలో గిరిజనులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భైరి ఓంకార్ మాట్లాడుతూ గిరిజనులు పిల్లలను ఉన్నతంగా చదివించుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరూ కూడా ఐక్యంగా ఉంటూ తమ హక్కులను కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగన్న, గుర్రప్ప, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల వర్ధంతి


నివాళులర్పిస్తున్న లలితా కళా సమితి సభ్యులు


ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 11: ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో దివంగత ఘంటసాల వెంకటేశ్వరావు 50వ వర్ధంతి వేడుకలు లలితా కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అలర్పించారు. అనంతరం ఘంటసాల పాడిన పాటలను వినిపించారు. ఈ కార్యక్రమాన్ని బిజ్జం వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు


పూజలందుకుంటున్న సాయిబాబా

బేతంచెర్ల, ఫిబ్రవరి 11: పట్టణ శివారులోని కర్నూలు రహదారిలో వెలసిన షిరిడీ సాయిబాబా 16వ ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 7.30 గంటలకు షిరిడీ సాయిబాబా పారాయణం సాయంత్రం 3 గంటల నుంచి బాబా వారి నగర దర్శనం (గ్రామోత్సవం) ప్రత్యేక వాహనంలో బాబా చిత్రపటాన్ని ఊరేగించారు.

ఆలయ ఈవోగా రామాంజనేయులు


ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన రామాంజనేయులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 11: మండలంలోని మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానం నూతన ఈవోగా ఎం.రామాంజనేయులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు దేవస్థానం అర్చక వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో క్షేత్రం పరిశీలన చేసి భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలను, అభివృద్ధి పనులు వంటి వాటిపై ఆరా తీశారు. ఆలయ సిబ్బందికి ఉన్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన ట్రస్టు బోర్డు సలహాలు తీసుకుని భక్తులకు సౌకర్యాలు పెంచి , ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

బేతంచెర్లలో కోట్లకు ఘన స్వాగతం


కోట్లకు స్వాగతం పలుకుతున్న నాయకులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 11: మాజీ కేంద్ర మంత్రి, టీడీజీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డికి బేతంచెర్ల పాతబస్టాండులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం బేతంచెర్ల మీదుగా ప్యాపిలికి వెళ్తుండగా.. మార్గమధ్యలో బేతంచెర్లలో సర్పంచులు శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, గూటుపల్లి టీడీపీ నాయకుడు ముల్లాలు కారు ఆపి బాణసంచా పేల్చి గజమాలతో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని సన్మానించారు. ఎన్నికలు దగ్గరపడుతున్నాయని, అందరూ కలిసికట్టుగా ఉండి టీడీపీని గెలిపించాలని కార్యకర్తలకు కోట్ల సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుట్టపాశం వెంకటేశ్వర్లు, సుభాన్, సయ్యద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విశ్రాంత హెచ్ఎం మృతి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 11: ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని జాతీయ రహదారిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన పడకండ్ల గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నెమలి శివశంకరరెడ్డి(66) మృతి చెందారు. ఈ నెల ఒకటో తేదీన శివశంకరరెడ్డి తన కుమార్తె చైతన్యకు స్కూటర్ డ్రైవింగ్ నేర్పించడానికి వెళ్లారు. ప్రమాదానికి గురై తండ్రి, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రైవేటు వైద్యశాలకు తరలించగా కూతురు ప్రాణపాయం నుంచి బయటపడగా, శివశంకరరెడ్డి చికిత్స పొందుతూ మరణించారని పట్టణ పోలీసులు ఆదివారం చెప్పారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుట్టాలమ్మకు పూజలు


పుట్టాలమ్మకు దర్శనానికి బారులుదీరిన భక్తులు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 11: ఆళ్లగడ్డ మండలంలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో వెలసిన అమ్మవారికి ఆదివారం భక్తులు పూజలు చేశారు. భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి చెల్లించుకున్నారు. భక్తులకు అర్చకులు అన్నదానం చేశారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 11: మండలంలోని కొండమాయపలె, రుద్రవరం, చిన్నకంబలూరు, యల్లావత్తుల గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. బోనాలు సమర్పించారు.

● మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించారు.

ఘనంగా కాశిరెడ్డినాయన జయంతి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 11: మండలంలోని నందిపాడు గ్రామంలో కాశిరెడ్డినాయన ఆశ్రమంలో స్వామివారి జయంతి ఉత్సవాలు ఘనంగా ఆదివారం నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు నాయనా మూల విరాట్‌కు జలాభిషేకం, క్షీరాభిషేకం కుంకుమార్చన నిర్వహించారు. చెక్క భజన పూలరంగడు నాటకం అద్దంకి కళాకారులచే ప్రదర్శించారు.

వాల్మీకి గుహలు అద్భుతం

ప్యాపిలి, ఫిబ్రవరి 11: వాల్మీకి గుహలు అద్భుతంగా ఉన్నాయని గుత్తి కోట పరిరక్షణ సమితి కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వాల్మీకి గుహలను పరిరక్షణ కమిటి సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గుహలోని ప్రకృతి సిద్ధంగా వెలసిన ఆకృతులు ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 11 : పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని పోతిరెడ్డి ట్రస్ట్ అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని బెలుం గ్రామంలో ఆయన ట్రస్ట్ ఆధ్వర్యంలో డస్ట్‌బిన్, బకెట్, టబ్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ చెత్తచెదారం రోడ్లపై ఇష్టనుసారంగా పడవేయకుండా డస్ట్‌బిన్‌లలో వేసి పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పోతిరెడ్డి లక్ష్మీదేవమ్మ, ప్రమీలమ్మ, చైతన్యరెడ్డి ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను వంచించిన జగన్ ప్రభుత్వం : టీడీపీ

డోన్, ఫిబ్రవరి 11: వైసీపీ ప్రభుత్వం మాయమాటలతో నమ్మించి బీసీలను వంచించిదని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున అన్నారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజావైద్యశాల మల్లికార్జున మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జయహో బీసీ కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. వైసీపీ పాలనలో బీసీలను పూర్తిగా అణగదొక్కారనీ ధ్వజమెత్తారు. 56 బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసినా పైసా నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారనీ మండిపడ్డారు. టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీని గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు బీసీలంతా కలిసికట్టుగా పని చేద్దామని కోరారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు


విజయవాడలో అరెస్టవుతున్న డోన్ ఏఐవైఎఫ్ నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 11: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్ అన్నారు. నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకుని 35వేల ఉపాధ్యాయు పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడకు తరలిన ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడలో జరిగిన అరెస్టును ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్ ఖండించారు. ఎన్నికల ముందు మెగా డీఎస్సీ ద్వారా 35వేలకు పైగా పోస్టులను భర్తీ చేస్తానన్న జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 6వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు.

వైభవంగా క్షీరాభిషేకం


చాగలమర్రిలో వాసవీమాతకు క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి, ఫిబ్రవరి 11: చాగలమర్రి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీమాత ఆత్మార్పణ దినం ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు పెద్దశాస్త్రి ఆధ్వర్యంలో వాసవీమాతకు క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, జలాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని వెండి రథంలో కొలువుదీర్చి పల్లకి ఉత్సవం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శివప్రసాద్, ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, ఆర్యవైశ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల ఫిబ్రవరి 11: ట్రాఫిక్ నిబందనలు పాటించి ప్రమాదాలు నివారించుకోవాలని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర ఆటో డ్రైవర్లకు సూచించారు ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఎస్ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ జయచంద్ర మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు.

ముగిసిన శతావధానం


నంద్యాల డీఈవో సుధాకరరెడ్డిని సన్మానిస్తున్న అవధానులు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 11: ఆళ్లగడ్డ పట్టణంలోని రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో మూడు రోజుల పాటు జరిగిన శతావధాన కార్యక్రమం ఆదివారం ముగిసింది. డీఈవో సుధాకరరెడ్డి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల భాస్కరుడు, భరతకుమార్‌శర్మ 17 ఏళ్ల వయస్సులో 22 నిమిషాలలో శతావధానంలో అడిగిన ప్రశ్నలకు వర్ణనలకు, ఆశువులకు, దత్తపదవులకు ఏకదాటిగా సమాధానాలు అందించి తన ప్రతిభను చాటుకున్నారని అన్నారు. భవిష్యత్తులో వీరు అవధాన ప్రపంచంలో చక్రవర్తులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం వద్దిపర్తి పద్మాకర్ త్రిబాషా శత సహస్ర అవధానులు డీఈవోను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో మాధవ రావు, శివప్రసాద్, మధుసూదన్‌రావు, అహోబిలం ప్రధాన అర్చకుడు వేణుగోపాలన్, అమీర్‌బాషా, రామకృష్ణ, సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.